# రావూరావు ప్రణయ కథ

శ్రీ నవయువక నాటకమండలి పేరు మీలో ఎక్కువమంది వినిఉండరు. అది 1929 మే నెలలో స్థాపించబడి తొలకరి వచ్చేసరికి కారణాంతరాలవల్ల దివాలా ఎత్తింది.

దాన్ని బయలుదేరదీసిన వారు తిపిర్నేని దాసయ్యచౌదరి. అది అంతం కావటానిక్కూడా ఆయనే కారణభూతుడు.

తప్పు మాత్రం చౌదరిది కాదు. మా మెంబర్లదే. అప్పట్లో మేమెవరమూ చౌదర్ని అర్థం చేసుకోలేదు. మేము ప్రదర్శించిన ఏడెనిమిది ప్రదర్శనాలకుగాను చౌదరి నాలుగువేలపై చిల్లర సంపాదించాడు. మా మెంబర్లలో ఎవరికీ 50, 60 రూపాయలకుపైగా దక్కలేదు. పేపర్లలో మెప్పు సంపాదించింది మేమూ: లాభం యావత్తూ చౌదరికి ఎందుకు పోవాలి? అంతవరకే మాకు అర్థమయింది,

మమ్మల్ని గురించి పత్రికల్లో ఘనంగా వాయించినవాడు చౌదరేనని కూడా మాకు అర్థం కాలేదు. నిజంగా మాలో గొప్పతనం ఉందనే అనుకున్నాం. మాకు శివ రాముడు ఒక సామ్యవాదికూడా పోస్తైనాడు.

"చౌదరిగారూ, మా జీతాలు రెట్టింపు చెయ్యకపోతే మేము వేషాలు వెయ్యం!" అని ఏకగ్రీవంగా చెప్పాం.

చౌదరి నవ్వలేదు. కోప్పడలేదు. మా వంక ఒక్క నిముషంసేపు మౌనంగా, నిదానించి చూశాడు.

"మీకిప్పటికే ఎక్కువ ముట్టటంలేదని మీకు నమ్మకం ఏమిటి?" అన్నాడు చౌదరి.

లాభంలేకపోయింది. శివరాముడు సోషలిజం మా బుర్రల్లోకి బాగా ఎక్కించాడు.

"మేమందరమూ కలిసి సంపాదించిన దానికన్న మీకు ఎనిమిదింతలు ముట్టడంలో ఏమి న్యాయం ఉందీ?" అన్నాడు మా "కామ్రేడ్".

"నేనంత తీసుకోటానికి అర్హుణ్ని కానని మాత్రం మీకు నమ్మకం ఏమిటి?" అన్నాడు చౌదరి మళ్ళీ.

కాని మేము చౌదర్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నం చెయ్యలేదు.

"సరే, ఈ కంపెనీ ఇంతటితో ఉపసంహరించుకుందాం— నేను మీ జీతాలు ఇప్పుడప్పుడే ఎక్కువ చెయ్యబోవటంలేదు. నేను పైనించి హంగు చెయ్యకపోతే మీలో ఒక్కడు కూడా దమ్మిడీకి పనికివచ్చే స్థితికింకా రాలేదు. కనుక మీరు మీమీ ఊళ్ళకు వెళ్ళిపోండి. మీరీలైనులోనే ఉండదలిస్తే నాతో మీకు అవసరం ఉంది. కాని నాకు మీతో అవసరం లేదు. ఒక్క నెలలో మీవంటి సెట్టును మరొకదాన్ని సులభంగా తయారుచేస్తాను. దేశం మీవంటి నట నాయక శిఖామణులతో పొర్లిపోతున్నది. మీరెరుగుదురో ఎరుగరో!" ..

అంతటితో మా నాటకమండలి విచ్ఛిన్నమైపోయింది. ఆ తరవాత మేము మరొక పెట్టుబడిదారు సహాయంతో ఒక్కటంటే ఒక్క నాటకమే ఆడాం. రాళ్ళూ, పాతచెప్పులూ పడినై! మళ్ళీ మాలో ఎవరూ స్టేజీ ఎక్కిన పాపాన పోలేదు. నాతో నాయిక పాత్రలు వేసినవాడు ఒక ప్లీడరుగారి దగ్గర ఇప్పుడు వాలంటరీ చేస్తున్నాడు.

చౌదరి ఎందుకో ఇంకొక సమాజం లేవనెత్తలేదు. మా కింకొక చౌదరి దొరకటం ఎంత అసంభవమో, చౌదరికి సరిగా మావంటివాళ్ళే మళ్ళీ తటస్థ పడడం అంత తథ్యం!

మా నాటకమండలి వెలిగిన మూడునాళ్ళ పట్టపగలు కాలంలో ఒక విచిత్రమైన కథ జరిగింది. అది యింత కాలమూ బయటపెట్టడానికి అవకాశం

కథా నిలయం
23



లేకపోయింది. ఆ కథకు సంబంధించిన ఒకానొక వ్యక్తియొక్క మరణవార్త నిన్నటి స్వతంత్ర పత్రికలోనే చూశాను. ఇక ఈ కథ దాచవలసిన అగత్యం లేదు.

1929 జూన్ మొదటి వారంలో గుంటూరులో నాటకాలు వెయ్యటం మొదలుపెట్టాం. అ రోజుల్లో మా పెత్తల్లి కొడుకు శ్రీరాములు (అసలు పూర్తి పేరు శ్రీ రామారావు) గుంటూరు బ్రాడీపేటలో ఒక విశాలమైన గది తీసుకుని ఉంటూ కాలేజీలో బి. ఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

చౌదరి బహు లౌక్యుడు, మమ్మల్ని బెజవాడ నుంచి గుంటూరుకు రాత్రి తొమ్మిదిగంటల బండిలో చేరవేసి, ముందుగానే మాట్లాడి అట్టే పెట్టిన ఇంట్లో దించి, ఎవర్నీ బయటికి కదలవద్దని శాసించాడు.

"రేపురాత్రి నాటకం వడ్డ తరువాత మీరు మీ యిష్టప్రకారం ఊరేగండి. ఈలోపల ఈ కుర్రకారు వీధుల్లో కనబడ్డారంటే, మీ మొహాలు నలుగురూ చూశారంటే రేపు రాత్రి మనం ఖాళీ కుర్చీలకూ బెంచీలకూ నాటకం ఆడవలసిందే!" అన్నాడు చౌదరి. అందుచేత నేను శ్రీరాములుకు కబురు పంపించాను.

మర్నాడు శనివారం. మావాడికి కాలేజీలేదు. కనకవాడు నా కబురు అందగానే బయలుదేరి వచ్చాడు. సాయంకాలం దాకా సరదాగా గడిపాం. ఆ రాత్రి వాడు కూడా మాతోపాటు భోజనం చేశాడు, మాతోపాటు హాలుకు వచ్చాడు. నేను వేషం వేసుకుంటుండగా చౌదరి నా దగ్గరకు వచ్చి రహస్యంగా "మీ చుట్టం ఉన్నాడే ఆ అబ్బాయి మనతో వేషం వేస్తాడేమో కనుక్కుంటావా?" అన్నాడు.

"మీవి పాము చెవులండీ చౌదరిగారూ!" అన్నాను నేను నవ్వుతూ. "లాభం లేదు? వాడికి గుండె పగిలిపోతుంది, ఆ మాట వాణ్ని అడిగారంటే!" చౌదరి నిరాశ చెంది నా దగ్గర్నించి వెళ్ళిపోయినాడు.

చౌదరి మేనేజిమెంటు అద్భుతంగా ఉండేది. తొమ్మిదింబావుకల్లా మొదటి గంట వాయించారు. తొమ్మిదిన్నరకు ప్రార్థన కూడా అయిపోయి తెర లేచింది.

మా సమాజంలో కాస్త పాడగలవాణ్ని నేనే. నాకు నటించటం ఏ మాత్రమూ చాతకాని కారణంచేత నటించటానికి ఎక్కువ అవకాశం లేనటువంటివన్నీ దిట్టంగా పాడటానికి వీలున్నటువంటి వేషాలుగా చూసి ఇచ్చేవారు. సామాన్యంగా నాయకపాత్రే ధరిస్తూ ఉండేవాణ్ణి.

అంతా కొత్త. నేను స్టేజీకి కొత్త. నాకు ఊరు కొత్త. ఊరికి నాటకం కొత్త. నా మొదటి పద్యానికి వన్సుమోరు పడేవరకూ నా ప్రాణాలు అరిచేతిలో పట్టుకొని ప్రవర్తించాను. ఆ తరవాత పాట ధారాళంగా వచ్చింది. మూడో పద్యం హాలంతా మారుమోగేటట్టు పేల్చేశాను. దానికి మూడుసార్లు వన్సుమోరు పడ్డది? ఇక నాటకం రక్తికట్టినట్టే ననుకున్నాం.

ఆ రంగం అయిపోయి నేను లోపలికి వస్తూనే మా శ్రీరాములు కోసం వెతికాను. వాడు సైడు కర్టెన్ కంతల్లోంచి ప్రేక్షకులను చూస్తున్నాడు.

నేను వాడి భుజంమీద చెయ్యి వెయ్యగానే వాడు భూమిమీద నించి నాలుగంగుళాలైనా ఎగిరి ఉంటాడు. వాడి కంగారు నాకర్థం కాలేదు. నా పాట ఎట్లా ఉన్నదని అడుగుదామనుకున్నవాణ్ని, నా గొడవే మరిచిపోయి "ఏమిటిరా అదీ?" అన్నాను.

వాడు నా చెవిలో రహస్యంగా "మొదటి వరసలో నాలుగో కుర్చీ!" అన్నాడు వణుకుతున్న గొంతుతో.

నాకు వాడి మాటలు అర్థం కాలేదు. అయినా మొదటి వరసలో నాలుగో కుర్చీలో ఎవరున్నారో చూతామని తెర కంతల్లోంచి చూశాను. కుర్చీలు లెక్క-పెట్టకుండానే నా దృష్టి ఆ మనిషి మీదికి వెళ్ళింది.

నేను మావాడి వంక తిరిగి "బాగానే ఉంది. కిరస్తానీ మనిషల్లే ఉంది!" అన్నాను.

"కాదు. బ్రాహ్మణమనిషే! వితంతువు! పంతులమ్మ!" అన్నాడు మావాడు.

"ముస్సైఅయిదేళ్ళుంటయ్యేమో!" అన్నాను.

"ఛా! ఇరవై ఆరు. వచ్చే ఆగస్టుకు!" అన్నాడు మా శ్రీరాములు.

వ్యవహారం చాలాదాకా ఉందే అనుకుని "నువ్వామెని బాగా ఎరుగుదువా ఏమిటి?" అన్నాను.

"ప్రతిరోజూ నా గది ముందుగానే పోతుంది!.... నేనామెకోసం చచ్చిపోతున్నానురా! నావంక చూడనైనా చూడదు! దగ్గుతాను, సకిలిస్తాను. ఏమీ ప్రయోజనం లేకుండా ఉంది. ఆమె దృష్టిని ఆకర్షించటానికి నేను చెయ్యవలిసి వస్తున్న పనులు నాకే తలవంపుగా ఉన్నై. ఏం చెయ్యనూ?"

నేను మావాణ్ని భుజంమీద తట్టి "మంచి పిల్లనుచూసి పెళ్ళిచేసుకో! నన్నుచూడూ! నేనిప్పుడు రంభకుకూడా వశుణ్ని కాను!" అన్నాను.

మావాడు దీనంగా "ఆవిడ ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుంటాను!" అన్నాడు.

ఈ లోపల నాకు పిలుపు వచ్చింది. నేను వెళ్ళిపోయినాను.

ఆ నాటకం జరుగుతున్నంత సేపు మావాడు ఆ సైడు కర్టెను కంతదగ్గిరే ఉన్నాడు. ఆ రాత్రి ప్రదర్శనం మావాడి సహాయం అవసరం లేకుండానే జయప్రదంగా వెళ్ళిపోయింది కనక సరిపోయింది.

"చౌదరిగారూ, నేను మావాడి గదికివెళ్ళి అక్కడే పడుకుంటాను" అన్నాను.

"మంచిది. రేపు మధ్యాహ్నం రెండింటికి రిహార్సల్ మొదలు" అన్నాడు చౌదరి.

నేను బయట నిలబడతాను– గాలికి" అని చెప్పి అంతకు పూర్వమే మావాడు బయటికి వెళ్ళాడు.

నేను బయటికి రాగానే వాడు నన్ను రెక్క పట్టుకుని లాగుతూ "త్వరగా రా బండి మాట్లాడాను" అన్నాడు. వాడి అడావుడి మొదట్లో అర్థం కాలేదు.

ఎట్లాగైతే ఏం మావాడి కోరిక ఫలించింది. వాడి యాజమాన్యంకింద మా బండి పంతులమ్మ బండి వెనకకు చేరింది. ముందు బండిలో పంతులమ్మ మీద రోడ్డుపక్క దీపపుకాంతి పడ్డప్పుడల్లా మావాడి శరీరం జల్లుమనేది. వాణ్ణిచూసి ఛాలా జాలిపడ్డాను.

మర్నాడు నేను నిద్రలేచేటప్పటికి తొమ్మిది గంటలయింది. నాకోసం మావాడు ఇడ్లీ కాఫీ వగయిరాలు తెచ్చిపెట్టి ఉంచాడు. నేను కాలకృత్యాలు నిర్వర్తించుకుని టిఫిను తీసుకునేటప్పటికి పది కావస్తున్నది.

"సరిగా పదింటికి ఇటుగా వెళుతుంది" అన్నాడు మావాడు.

"ఎవరు?" అన్నాను మరిచిపోయి.

"రాత్రి మనం చూసిన మనిషే"

"పంతులమ్మా"

"ఆ మాట అనకు! నాకు అమిత అసహ్యం"

"ఓరి బైతూ! ఇవాళ ఆదివారం"

"ఒక్కొక్కసారి ఆదివారం అయినా స్కూలుకు వెళ్ళుతుంది" అన్నాడు మావాడు "మళ్ళీ పన్నెండింటికల్లా వస్తుంది."

"ఎవరికోసమైనా–"

"ఛా! ఆవిడ అటువంటిది కాదు. నిప్పు. నిప్పనుకో!"

"నిప్పయితేమట్టుకు ఆదివారంనాడు స్కూలుకు వెళ్ళాలని ఉందా ఏమిటి?" అన్నాను.

"బాగుందే! ప్రైవేటు క్లాసులు పెట్టుకుంటుంది!"

మావాడు అమాట అంటూనే బయటికి పరిగెత్తి మళ్ళీ ఒక్క అంగలో లోపలికి వచ్చి "వస్తున్నది! వస్తున్నది! ఒరే, ఒక పని చెయ్యి! కిటికీ దగ్గర నిలబడి రాత్రి పాడిన పాట పాడు. త్వరగా!" అన్నాడు.

నేను నిర్ఘాంతపోయి "నా చాతకాదు నువ్వే పాడు" అన్నాను.

"అమ్మో.... ..........బ్రదర్, బ్రదర్ పాడరా!" అన్నాడు.

"నేను కిటికీ దగ్గిర నుంచోను కాని పాడమంటే పాడతాను" అని కిందటి రాత్రి పాడిన పాటల్లో ఒకటి సన్నగా పాడటం మొదలుపెట్టాను. మొదటిసారి స్టేజీ ఎక్కిన వాడికల్లే నా గుండె కొట్టుకోవటం మొదలుపెట్టింది. గొంతుకూడా కొద్దిగా వణికింది.

ఇంతలో ఆవిడ మావాడి గదిముందుకు వచ్చింది. తలఎత్తి కిటికీవంక చూస్తూ వెళ్ళింది.

"చూశావా!" అన్నాడు మావాడు చాటంత మొహంతో. "రాత్రికూడా గమనించాను నేనెంగినంతవరకూ ఆవిడ ఎవరివంకా చూడదు. రాత్రి నువ్వు పాడుతుంటే ఆవిడ కళ్ళలో ఒక విధమైన మెరుపు, ఒక విధమైన "లవ్‌లైట్" చూశాను. ఎన్నడూ నేను ఎంత చప్పుడు చేసినా ఈ కిటికీవంక చూడని మనిషి నీ పాట విని ఇటు తిరిగింది! ఆవిడ నిన్ను ప్రేమిస్తున్నది. నన్ను ప్రేమించదు!" అన్నాడు మావాడు నిస్పృహతో.

వాడికి క్లుప్తంగా నోరు ముయ్యమని సలహా ఇచ్చాను.

మర్నాడు రాత్రి నాటకానికి ఆవిడ మళ్ళీ చూడవచ్చింది. మావాడు ఆవిణ్ని చూడవచ్చాడు.

మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఎవడోవచ్చి నా పేరుచెప్పి "ఇక్కడ ఉంటారా?" అని అడిగాడు.

నేను ఆశ్చర్యపడి ఎందుకన్నాను వాడు నాచేతిలో ఒక ఉత్తరం పెట్టి వెళ్ళాడు. నేను మరింత ఆశ్చర్యంతో ఆ ఉత్తరం చూసుకున్నాను.

"దయచేసి మీరు నా ఆతిథ్యం ఎప్పుడు స్వీకరించగలరో తెలియ చెయ్యండి—రుక్మిణి"

"ఎవరు రుక్మిణి?" అన్నాను మావాడితో.

"ఆవిడే?" అన్నాడుమావాడు సంతోషంచేత మాట్లాడలేకుండా.

పంతులమ్మా అని వెంటనే నాలిక కొరుక్కున్నాను.

తరవాత ఒక గంటకు రుక్మిణమ్మ మా గదికే వచ్చింది. మావాడి స్థితి వర్ణనాతీతం అనుకోండి!

ఆవిడ నవ్వుతూ నన్నుద్దేశించి, "మీరాడుతున్న నాటకాలు చూస్తున్నాను. (మావాణ్ణి చూపించి) వీరు కూడా మీతోపాటు వేషం వేసినట్టు—" అన్నది.

"లేదు! మావాడు ఇక్కడ బియ్యే చదువుతున్నాడు. నేను వాడికి అతిథిని"

"అట్లాగా! అయితే మీరిద్దరూ కూడా మా యింటికి ఆతిథ్యానికి రావాలని నా ప్రార్థన."

"మీకెప్పుడు వీలవుతుంది?" అన్నాను.

"మీ యిష్టం నాకెప్పుడైనా వీలే."

"ఈ రాత్రి నేను లాడ్జిలో భోంచేస్తాను. మాకు రిహార్సల్ ఉంది. రేపు ఉదయం మీకు వీలేనా?"

"ఓ మహారాజాగా? ఎనిమిదింటికల్లా దయచెయ్యండి! ఇద్దరూనూ! మరిచి పోవద్దు!"

రుక్మిణమ్మ వెళ్ళిపోయింది.

మర్నాడుదయం నేనూ మా శ్రీరాములూ రుక్మిణమ్మ ఆతిథ్యం గ్రహించాం. ఎనిమిదింటికే ఆవిడ నౌకరు మా యింటికి వచ్చి మమ్మల్ని తీసుకు పోయినాడు. మాకు వెంటనే ఆవిడ కాఫీ యిచ్చింది. ఆ తరవాత ఆవిడ కబుర్లు చెప్పి, గ్రామఫోనుతోటి మమ్మల్ని రంజింపచేసింది. తొమ్మిదిన్నరకు ముగ్గురమూ భోంచేశాము.

ఆవిడ నా సంగీతాన్ని ఒకటికి పదిసార్లు మెచ్చుకుంది, నాచేత ఒకటి రెండు కీర్తనలు కూడా పాడించింది. నన్నంత గొప్పగా చూసినవాళ్ళు అప్పటికీ ఇప్పటికీ ఎవరూ లేరు.

సంభాషణ యావత్తూ నాకూ ఆవిడకూ మధ్య నడవటమూ మావాడు నా పక్కన ఉండీ ఉండనివాడు కావటమూ నాకు బాగాలేకపోయింది. అందుకని అవకాశం చూసుకుని "మావాడు కూడా—" అని ప్రారంభించగానే వాడు నన్ను గట్టిగా గిల్లాడు. అందుకని నేను "మావాడిక్కూడా సంగీతమంటే బహు ఇష్టం?" అన్నాను. రుక్మిణమ్మ వినిపించుకోనట్టు.

"అట్లాగా?" అన్నది. ఇక మావాడికి విముక్తి లేదని భావించుకుని ఊరుకొన్నాను.

ఆనాడు మళ్ళీ నాటకం. గౌరవంగా ఉంటుందని ఆవిడకు ఒక కాంప్లి మెంటరీ టిక్కెట్టు నేను స్వయంగా తీసుకువెళ్ళి ఇచ్చాను.

ఆ రాత్రి నాటకంనించి నేనూ మావాడూ తిరిగివచ్చిన తరవాత మావాడు చిత్రంగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. సుమారు ఎనభై మందికి సరిపొయ్యే ఉద్రేకాన్ని ఒక్కడే లోపల ఇముడ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించాడు. రాత్రి ఒంటిగంటన్నరవేళ నిద్రపోవటానికి ప్రయత్నం చెయ్యకపోగా అటూ ఇటూ గదిలో పచారు చెయ్యటం మొదలుపెట్టాడు.

"ఏమిట్రా నువ్వు? నాకు నిద్రవస్తున్నది!" అని వాణ్ణి కోప్పడ్డాను.

"ఓహో! బాగుందే! నువ్వు నిద్రపో!" అన్నాడు వాడు.

నేను నిద్రపోయినాను ఒక్క అయిదునిమిషాలన్నా నేను కళ్ళు మూసినట్టు లేదు. మావాడు నన్ను నిద్రలేపాడు. కళ్ళు తెరువబోయి గట్టిగా మూసుకున్నాను. గదిలో దీపం జ్యోతిమాదిరిగా వెలుగుతున్నది.

"ఒరే! నేను ఈ బండికి మావూరు పోతున్నాను. మళ్ళీ వారంరోజులుండి వస్తాను!" అన్నాడు మావాడు.

నా నిద్రయావత్తు తీసేసినట్టు మాయమైంది. నేను లేచి కూర్చుని "ఏమిటదీ?" అన్నాను.

"ఇందాక మీ నాటకం జరుగుతుండగా ఆవిడ నౌకరు వచ్చి నాచేతికి ఒకచీటీ యిచ్చి వెళ్ళాడు. దానిలో 'నాటకంకాగానే పడుకోటానికి మాయింటికి

రండి!" అని ఉంది. అది నేను నీతో చెప్పలేదు. ఆ చీటీ నీకేమోనని అనుమానం తట్టింది. కాని నీతో చెప్పదల్చుకోలేదు.

"నీవు నిద్రపోగానే నేను వాళ్ళింటికి వెళ్ళాను. ఆవిడ కనిపెట్టుకుని ఉంది– నాకోసంకాదు! ...

"నేను ఒక్కసారి మావూరువెళ్ళివస్తాను!"

నేను దీర్ఘంగా యోచించాను. మావాడు చాలా అవివేకంగానూ ఉద్రేకంతోనూ ప్రవర్తించాడు. పొరబాటు జరిగిపోయింది.

'ఒరే, నీవు తొందరపడకు. నేను పొద్దున్నే వెళ్ళి ఆవిడకు నీబదులు క్షమాపణ చెప్పివస్తాను. ఆ తరువాత నువ్వు కావాలంటే గదిమార్చు. ఎక్కడికీ పారిపోనక్కరలేదు!" అని నేను మావాడికి ధైర్యం చెప్పాను.

మర్నాడు ఏడున్నరకే నేను రుక్మిణమ్మగారింటికి వెళ్ళాను. ఆవిడ నావంక ఉత్సాహంతో చూడలేదు.

నేను వెళ్ళుతూనే "రాత్రి మావాడు చేసిన అవివేకానికి క్షమించండి మీ నౌకరు మీ చీటీ మా వాడికిచ్చాడట?" అన్నాను.

రుక్మిణమ్మ ఆశ్చర్యంతో "ఓరివెధవా! – నేను వాడితో నిన్న మనింటికి భోజనానికి వచ్చిన వారిలో పొడుగాటి ఆయనకు ఇది ఇవ్వు?" అని స్పష్టంగా చెప్పాను అన్నది."

"అంటే నాకేనా"

"అవును!"

"మీకు కోపంవస్తే క్షమించాలి! – ఇటువంటి అవినీతిపనులు చేసేటప్పుడు ఎంత జాగర్త అయినా అవసరం!" అన్నాను.

రుక్మిణమ్మ ఆశ్చర్యంతో "అవినీతీ!" అన్నది. మీరురాగానే మీతో స్పష్టంగా నా ఉద్దేశం చెప్పదామనే అనుకున్నాను. నేను ఊరికే కామం తీర్చుకోవటానికి మిమ్మల్ని రమ్మనలేదు. అట్లా అయితే నేనింతకాలం మొగవాడిమొహం చూడకుండా ఉండను.

"మా నాన్న మంచి సంగీతపాటకుడు. మా అమ్మకి మా అమ్మకన్న సంతానంలో నాకొక్కత్తెకే సంగీతం అబ్బింది. నాభర్త నాచిన్నతనంలోనే పోయినాడు. ఎప్పటికైనా నావిధిగా భావించుకుని మంచి పాటగాడికి ఒకబిడ్డను కందామనుకున్నాను. అది నాకు మతవిషయికమైన సంగతి – మీరు అర్థం చేసుకోలేకపోవచ్చును.

"మిమ్మల్ని చూసింతరవాత, మీ పాట విన్న తరవాత మీ వల్ల గర్భం

పొందటం నాకు విద్యుక్త ధర్మమల్లే భావించాను. అందులో నేను సిగ్గుపడటానికి గాని, జాగ్రత్తపడటానికిగాని ఏమీ అవసరంలేదు."

"మైగాడ్!" అన్నాను ఆవిడ మాట్లాడటం చాలించగానే.

"ఏమిటది?"

"మీ ఉద్దేశం నేను గ్రహించగలిగానులెండి. కాని — కాని —" నానోట మాటరాలేదు.

"చెప్పండి!" అన్నది రుక్మిణమ్మ.

"నాపాటేం విన్నారు. మావాడు — రాత్రి మీయింటికి వచ్చినవాడు — వాడు నాకన్న లక్షరెట్లు బాగాపాడుతాడు. వాడిముందర నేను ఎందుకూ పనికిరాను! వాణ్ణి — అవమానించి పంపి ఉంటారు!" అన్నాను.

"నిజమా, ఎగతాళా?" అన్నది రుక్మిణమ్మ.

"చెడ్డఒట్టు! వాడు మా మాదిరిగా పాటగాడుకాదు! సాక్షాత్తూ సరస్వతీ అవతారమన్నమాట. నేను అటువంటిపాట ఎక్కడా వినలేదు. వింటాననుకోను."

రుక్మిణమ్మ కాస్సేపు యోచించి చివరకు, "పాపం, ఆయన్ని అవమానం చేశాను — తెలియక. ఆయన్ని ఒకసారి మా యింటికి పంపుతారా?" అన్నది.

"ఓ! తప్పకుండా."

* * *

"డాం హర్! నేనావిడ ముఖం ఎప్పటికీ చూడను! నేనావిణ్ణి ప్రేమించాను ఆవిడ నాపాటను ప్రేమిస్తుందేం?" అన్నాడు మావాడు వికటంగా నవ్వుతూ.

"విరిగిన మనస్సు అతకదు!" అని నేను నిట్టూర్పు విడిచాను.

(ప్రథమ ముద్రణ : నవంబరు 1936, జయలక్ష్మి)